క్లుప్తంగా

కలెక్టరేట్‌లో అంధకారం



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన వీధి లైట్లు వెలగక అంధకారంగా అలముకుంది. కలెక్టరేట్ ప్రాంగణంలో ఆటోమెటిక్ సిస్టమ్‌తో వీధి లైట్లు ఏర్పాటు చేశారు. అయితే ఈ లైట్లు ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు ఆరిపోతాయో తెలియని పరిస్థితి. ఈ కారణంగా కలెక్టరేట్‌లోని ఆయా శాఖల్లో పనిచేసే ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. కార్యాలయం పనివేళలఅనంతరం మహిళా ఉద్యోగులు వారి ఇళ్లకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో విషసర్పాలు సంచరిస్తాయేమోనని భయపడుతున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ లైటింగ్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో వెలిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠామహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



అవనిగడ్డ: స్థానిక 7వ వార్డులో నూతనంగా ప్రతిష్ఠించిన కోదండ రామస్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పాల్గొన్నారు. స్వామివార్లకు అమ్మవార్లకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆశీస్సులు తీసుకున్నారు. పార్టీ నాయకులు గార్లపాటి గోపి, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న మంత్రి

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, గనులు భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, విరూప్‌శర్మ, మణిదీప్‌శర్మ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు. ఆయన వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

అట్లతద్దె ఉయ్యాల సందడి

కోడూరు: అట్లతద్దె పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఉయ్యాల వద్ద మహిళలు సందడి చేశారు. మండలంలోని స్వతంత్రపురం గ్రామంలో సంప్రదాయబద్ధమైన రోటి ఉయ్యాలను ఆ గ్రామ యువకులు ఏర్పాటు చేశారు. స్తంభానికి చక్రాన్ని ఏర్పాటు చేసి, వాటికి ఉయ్యాలను అమర్చడంతో మహిళలు ఆ ఉయ్యాలలపై ఊగుతూ సందడిగా గడిపారు. అట్లతద్దె నాడు ఇలా ప్రాచీన పద్ధతిలో ఉయ్యాల ఏర్పాటు చేసి స్వతంత్రపురం గ్రామస్తులు ఆదర్శంగా నిలిచారు.

హుండీ కానుకల లెక్కింపు

మచిలీపట్నంటౌన్: స్థానిక బచ్చుపేటలో భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, ఈ ఆలయ దత్తత దేవాలయం శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను బుధవారం లెక్కించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆరు నెల 14 రోజులకు రూ.4,71,015 ఆదాయం రాగా, మల్లేశ్వర స్వామికి రూ.1,25,110 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి కే శ్రీనివాసరావు, వంశపారంపర్య ధర్మకర్త ముత్తేవి రవికాంత్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి మినిమం టైం స్కేల్ ఉద్యోగుల వినతి

మోపిదేవి: మినిమం టైం స్కేల్‌పై విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ మంత్రి కొల్లు రవీంద్రకు మోపిదేవి దేవస్థానం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. బుధవారం మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దర్శనానికి విచ్చేసిన మంత్రిని కలిసి తమ గోడు విన్నవించారు. పెరుగుతున్న జీవన వ్యయాలతో తమ జీతాలు సరిపోవడంలేదని, పలు ఇబ్బందులను మంత్రికి విన్నవించారు. సీఎం చంద్రబాబునాయుడు, డీసీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

దుర్గామాత విగ్రహం నిమజ్జనం

మోపిదేవి: స్థానిక బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని బుధవారం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నెలకొల్పిన దుర్గమ్మ తల్లి వివిధ రూపాల్లో 11 రోజుల పాటు విశేష పూజలు అందుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు.

సచివాలయ కార్యదర్శులకు జీతాలు కరువు

వాట్సాప్ గ్రూపులో చేరితేనే ఇస్తామంటున్న కమిషనర్



జీతాలు ఇవ్వాలని కమిషనర్‌ను కోరుతున్న సచివాలయ కార్యదర్శులు

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న వార్డు సచివాలయ కార్యదర్శులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. నగరం పరిధిలోని 50 డివిజన్లో పనిచేస్తున్న 435 మంది కార్యదర్శులు ఏదో ఒక సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ, వార్డు కార్యదర్శుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలే వీరి సమస్యలకు కారణంగా నిలిచాయి. సెప్టెంబర్ 30వ తేదీన నగరంలోని సచివాలయ కార్యదర్శులు నగరపాలక సంస్థకు సంబంధించిన అధికారిక వాట్సాప్ గ్రూపును బహిష్కరించి బయటకు వచ్చారు. దీంతో నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు ఇచ్చే ఆదేశాలు వీరికి చేరటం లేదు. అసలు సమస్య ఇక్కడే ప్రారంభమైంది. వాట్సాప్ గ్రూప్ నుంచి కార్యదర్శులు బయటికి రావడంతో వారిపై గుర్రుగా ఉన్న కమిషనర్ వారికి సంబంధించిన ఏ సమస్యను పరిష్కరించకుండా వాట్సాప్ గ్రూప్‌లోకి తిరిగి చేరితేనే పరిష్కరిస్తానంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇలా చేయకపోవడంతో వారి సమస్యలను కమిషనర్ పరిష్కరించకుండా వదిలేస్తున్నారు. గత మూడు నెలల క్రితం సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి నగరపాలక సంస్థకు 36 మంది కార్యదర్శులు వచ్చారు. వీరికి మూడు నెలలుగా జీతాలు వేయటం లేదు. అలాగే దాదాపు 100 మంది కార్యదర్శులకు ఏరియర్ బకాయిలు 25 మందికి ఇంక్రిమెంట్లు రావాల్సి ఉన్నా వాటిని ఇవ్వడం లేదు. అత్యవసర పనులు, అనారోగ్య కారణాలతో సెలవు కావాలని అడిగే కార్యదర్శులకు కమిషనర్ సెలవు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. ఓ కార్యదర్శి ఊపిరితిత్తుల సమస్యతో వైద్యం పొందాల్సి ఉన్నా సెలవు ఇవ్వని పరిస్థితి. ఓపక్క వలంటీర్ల పనిని సైతం తామే నిర్వహిస్తున్నా.. ప్రభుత్వం చెబుతున్న ప్రతి పనీ చేస్తున్నా కమిషనర్ ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని కార్యదర్శులు వాపోతున్నారు.

రాష్ట్ర జేఏసీ దృష్టికి సమస్యలు



నగరపాలక సంస్థ పరిధిలో కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర జేఏసీ నాయకులు దృష్టికి తీసుకు వెళ్లాం. ఈ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తామని హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థ పరిధిలో సచివాలయ కార్యదర్శుల సమస్యలను కమిషనర్ పరిష్కరించాలి. రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా వాట్సాప్ గ్రూప్ నుంచి బయటకు వచ్చామే తప్ప తాము కావాలని రాలేదు. అయినా ప్రభుత్వం చెప్పే ప్రతి పనీ చేస్తున్నాం. కమిషనర్ అలా వ్యవహరించడం ఇబ్బందిగా ఉంది.

– పి.కిరణ్ కుమార్, జేఏసీ నగర అధ్యక్షుడు

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

పెడన: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి వన్ నేషన్.. వన్ జీఎస్టీ అనే నినాదంతో ముందుకు అడుగులు వేస్తోందని, తద్వారా ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందనే విషయాన్ని అందరూ తెలుసుకోవాలని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేసీఎస్‌వీఎస్ రామారావు అన్నారు. బుధవారం కళాశాలలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడల్ట్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శేషుకుమార్, అధ్యాపకులు నిరంజనరావు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను ఫీల్డ్ విజిట్‌కు తీసుకువెళ్లి మార్కెట్‌లో పరిస్థితులు ఎలా ఉన్నాయో పరిశీలించి తెలుసుకున్నారు.

పెడన: స్థానిక విశ్వభారతి ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన పెంచేందుకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్, జీఎస్టీ ప్రత్యేక అధికారిణి ఎ.రాగమణి మాట్లాడుతూ జీఎస్టీ 2.0లో కేవలం 18 శాతం, ఐదు శాతం రెండు స్లాబులు మాత్రమేనని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, విశ్వభారతి స్కూల్ ప్రిన్సిపల్ అనుమకొండ గౌరీ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మచిలీపట్నంఅర్బన్: జీఎస్టీ సంస్కరణల ఫలితాలను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా చేయటంలో విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలలో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు, అధ్యాపకులు విజయశ్రీ, మమత, మున్వర్, సురేష్ పాల్గొన్నారు.

అవనిగడ్డ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ తగ్గింపు గొప్ప నిర్ణయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం అవనిగడ్డ రెవెన్యూ హాలులో సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించి పేద, మధ్య తరగతి వర్గాల, రైతుల కొనుగోలు శక్తి, పొదుపు గణనీయంగా పెంచాయన్నారు. ఈనెల 16న జీఎస్టీ అవగాహన సదస్సుకు రాష్ట్రానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేయనున్నట్లు తెలిపారు. ఎదురుమొండి బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ భారత ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయానికి రాష్ట్రంలో మాత్రమే విస్తృత ప్రచారం జరుగుతుందన్నారు. తగ్గిన జీఎస్టీ వివరాల కరపత్రాలు ఆవిష్కరించారు. మండలి వెంకట్రామ్, రాయపూడి వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ పాల్గొన్నారు.

రహదారులపై పశువుల కట్టడికి చర్యలు

మంత్రి కొల్లు రవీంద్ర

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో పశువుల కారణంగా రహదారులపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం మంత్రి మచిలీపట్నం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మచిలీపట్నం మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పశువులను నియంత్రించేందుకు గత ఆగస్టు నెలలో పశువుల శాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 326 పశువులను పశువులశాలలో ఉంచగా, వాటిలో 269 పశువులను యజమానులు రుసుము చెల్లించి తీసుకెళ్లారని వివరించారు. 16 పశువులు తీవ్ర అనారోగ్యంతో చనిపోయాయని పోస్టుమార్గం నివేదికలో తేలిందన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువుల శాల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పశువుల హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. అందుకోసం భూముల కేటాయింపు, నిధుల విడుదల త్వరలోనే జరుగుతాయని వివరించారు. రోడ్లపై సంచరిస్తున్న పశువులను సేకరించి గోశాలలో ఉంచేలా నిరంతర చర్యలు కొనసాగుతాయని మంత్రి చెప్పారు. మంత్రి వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, సహాయ మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకె నారాయణ ప్రసాద్ స్థానిక నాయకులు లోగిశెట్టి స్వామి, కోస్తా మురళి తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.సుధాప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భోగాది రాఘవారాణి అధ్యక్షతన మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈసమావేశంలో 21 శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందని, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు విధిగా హాజరుకావాలని కోరారు.

92 శాతం ఈ క్రాప్ నమోదు

పెడన: మండలంలో ఈ క్రాప్ 92 శాతం పూర్తయిందని, మిగిలిన శాతం కూడా ఈ నెలఖరులోగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని పెడన ఏవో ఎస్.జెన్ని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రాప్ నమోదు చేయించుకోని రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. రైతులు ఆర్ఎస్‌కేకు వెళ్లిన సమయంలో ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టా అడంగళ్ల కాపీ, సెల్ ఫోను తీసుకువెళ్లాలన్నారు. పంట పొలం ఏ గ్రామ సచివాలయ పరిధిలో ఉందో తెలుసుకుని సంబంధిత ఏరియా వీఏఏ లేదా వీఆర్వో లేదా తహసీల్దారు కార్యాలయం వద్ద వీఏఏలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఎంపీపీ, జెడ్పీటీసీలకు నోటీసులు

గూడూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని నిరశిస్తూ వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు గత నెలలో నిర్వహించిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబులకు మచిలీపట్నం పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధ వారం గూడూరు వచ్చిన మచిలీపట్నం పీఎస్ పోలీసులు ఎంపీపీ, జెట్పీటీసీలకు నోటీసులు అందించారు.

ఆలయ ఆవరణలో రెండు దుకాణాలు స్వాధీనం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్సన్‌పేటలో శ్రీ రంగనాయకస్వామి దేవస్థానానికి సంబంధించిన స్థలాన్ని గత 50 సంవత్సరాలుగా ఎలాంటి అద్దె చెల్లించకుండా ఆక్రమించుకుని నిర్వహిస్తున్న రెండు దుకాణాలను అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థల వివాదంపై పెదకాకాని కోర్టు తీర్పు ప్రకారం ఈ స్థలంలో ఉన్న ఆక్రమణదారులను తొలగించేందుకు అధికారులు ఈ చర్యకు దిగారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, మచిలీపట్నం తనిఖీ అధికారి కగ్గా శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి మాగపాటి సత్యప్రసాద్‌బాబు, ఇతర దేవాలయ సిబ్బంది, దేవస్థాన చైర్మన్ నల్లూరి వెంకటేశ్వరరావు, పాలక మండలి సభ్యులు, రాబర్ట్సన్‌పేట పోలీసు సిబ్బంది, విద్యుత్ శాఖ, రెవెన్యూ సిబ్బంది కలసి ఈ దుకాణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో మరో షాపు కూడా ఆక్రమణలో ఉందని దీన్ని నాలుగు వారాల్లో తొలగించాలని కోర్టు ఆదేశాలు ఉన్నాయని, గడువు పూర్తయ్యాక ఈ షాపును కూడా స్వాధీనం చేసుకుంటామని సాంబశివరావు తెలిపారు.

పోలీసు నిబంధనలను తప్పక పాటించాలి

కోనేరుసెంటర్: దీపావళి పండుగను పురస్కరించుకుని మందుగుండు సామగ్రి వ్యాపారులు, తయారీదారులు పోలీసు నిబంధనలను తప్పక పాటించాలని టౌన్ సీఐ ఏసుబాబు తెలిపారు. పోలీసు నిబంధనలను పట్టించుకోని వ్యాపారులు, తయారీదారులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా మందుగుండు సామగ్రిని కలిగి ఉండడం, అమ్మడం చట్టరీత్యానేరమన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది ఉండదన్నారు. అనుమతి లేకుండా మందు గుండు సామగ్రిని తయారు చేయకూడదన్నారు. మందు గుండు సామాగ్రిని గృహాలు, వ్యాపార దుకాణాల్లో అనధికారికంగా నిల్వలు ఉంచినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. లైసెన్స్ తీసుకునే ప్రతి వ్యక్తి తమ షాపులో పనిచేసే ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ చేయించి ఉండాలన్నారు. దీపావళి పండుగ ముందు తాత్కాలికంగా లైసెన్స్ పొందే వ్యాపారులు తమ మందుగుండు సామగ్రిని లైసెన్స్ కలిగిన గోడౌన్‌లలో మాత్రమే భద్రపరచాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రీ సర్వేతో ప్రయోజనం

గూడూరు: భూ రికార్డుల స్వచ్ఛీకరణకు ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని బందరు ఆర్డీఓ కె.స్వాతి అన్నారు. మండల పరిధిలోని నారికేడాలపాలెం పంచాయతీ ఆవరణలో నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ఆర్డీఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం చేకూరే రీ సర్వేకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. వారసత్వంగా సంక్రమించి అనుభవిస్తున్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామని వివరించారు. సర్పంచి జంపన రమాదేవి అధ్యక్షతన జరిగిన సభలో తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ శైలజా కుమారి, సర్వే అధికారులు లీలా ప్రసాద్, విజయ వర్మ, కె.జ్ఞాన సాయి, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

నేడు క్రీడా పోటీలు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం క్రీడల పండుగ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి తెలిపారు. పురుషులకు, మహిళలకు వాలీబాల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 10వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. సోలో, గ్రూప్‌ల వారీగా పాటల పోటీలు, డ్యాన్స్ పోటీలు, స్కిట్స్, ఫ్లాష్ మాబ్ పోటీలు ఉంటాయని బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు పశువైద్య శిబిరం

గూడూరు: మండల పరిధిలోని ఆకులమన్నాడు పంచాయతీలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గూడూరు వెటర్నరీ డిస్పెన్సరీ వైద్యాధికారి ఎం.అల్తాఫ్ హుస్సేన్ బుధవారం తెలిపారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటుగా చికిత్స అందిస్తామన్నారు. ఆకులమన్నాడు పరిసర ప్రాంత పాడి రైతులు శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

'ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఎందుకు?'

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఎందుకింత నిర్లక్ష్యమని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్ర సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉద్యోగులకు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని, మేము కూడా రాష్ట్ర ప్రజలమేనని ప్రభుత్వంలో భాగస్వామ్యులమేనన్నారు. 12వ వేతన సవరణ కమిటీని ఇంకా ఏర్పాటు చేయకపోవడానికి గల కారణం ఏమిటని ప్రశ్నించారు. గత పీఆర్సీ గడువు ముగిసి 24 నెలలు అయినా ఐఆర్ ప్రకటించకపోవటం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అక్టోబరు 10వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించాలని కోరారు.

11న విగ్రహాలకు వాయు ప్రతిష్ఠ

గణపేశ్వరం(నాగాయలంక): స్థానిక కోదండ రామాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దేవదాయశాఖ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీతా సమేత రామచంద్రమూర్తి పరివార దేవతల వాయు ప్రతిష్ఠా మహోత్సవం 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధి పిరాటి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. 9న విగ్రహాలకు జలాధివాసం, మహాశాంతి హోమాలు, 10న ప్రతష్ఠించే విగ్రహాలకు గ్రామోత్సవం, 11న ఉదయం గం.11.35లకు సహస్ర ప్రతిష్ఠాచార్యులు దుర్భా హరిబాబు శాస్త్రి (తెనాలి), దుర్గమ్మ అలయ ప్రధానార్చకుడు పోతుకూచి సత్యనారాయణశాస్త్ర నేతృత్వంలో విశేష వాయు ప్రతిష్ఠ నిర్వహిస్తారు. పూర్ణాహుతి, శాంతి కల్యాణం తదుపరి మహా అన్నసంతర్పణ జరుగుతాయి.

12న నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో 10వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంకలోని మారుతీ విద్యా నికేతన్ డిజిటల్ స్కూలు ఆవరణలో ఉదయం గం.9 నుంచి ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. వివరాల కోసం 94906 36466, 70936 17778లలో సంప్రదించాలన్నారు. పరీక్షల్లో శుక్లాలు నిర్ధారణ అయితే అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు (ఐఓఎల్ శస్త్రచికిత్స)శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

కైలాసపుర మందిరం ప్రారంభం



కైలాసపుర మందిరం ప్రారంభోత్సవంలో గ్రామ పెద్దలు

గూడూరు: కప్పలదొడ్డిలో నూతనంగా నిర్మించిన కైలాసపుర మందిరాన్ని బుధవారం సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. కప్పలదొడ్డి హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించే వారికి వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి చేయాలని గ్రామస్తులు సంకల్పించారు. దాతల నుంచి విరాళాలు సేకరించి రూ.10 లక్షల వ్యయంతో కైలాస మందిర నిర్మాణం చేపట్టారు. శ్మశాన వాటిక పక్కనే పంచాయతీ స్థలం కేటాయించడంతో నిర్మాణ పనులు చురుకుగా పూర్తి చేశారు. భవనంలో తిరుగు ప్రయాణ స్నానాలు ఆచరించి దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గది, మహిళలు పుణ్యవతి పూజలు చేయడానికి, కనీస వసతులు లేని, సొంత ఇల్లులేక ఇబ్బంది పడే వారు అంత్యక్రియల అనంతరం పది రోజులు నిర్వహించే పూజా కార్యక్రమాలకు అనువుగా భవన నిర్మాణాలు చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనికోసం పెద్ద హాలు అందులో శివలింగం, నందీశ్వరుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా సాగిన నిర్మాణ పనులను పేరిశెట్టి నాగరవి, బళ్ల నాగేశ్వరరావు, బూసం సాయిబాబు, మరకా విఘ్నేశ్వరరావులు పర్యవేక్షించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు యక్కల నాగరాజు, పేరిశెట్టి మధుసూదనరావు, కట్టా మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సమన్వయంతో పనిచేయాలి

ఘంటసాల: అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పని చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణ చేయాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. మండలంలో ధాన్యం సేకరణపై ప్రణాళిక రూపొందించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో మిల్లర్లు, వ్యవసాయ, రెవెన్యూ, పీఏసీఎస్ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ధాన్యం సేకరణకు ఐదు మిల్లులు గుర్తించినట్లు చెప్పారు. ఆయా మిల్లుల్లో సరిపడా గోనె సంచులు ఉన్నట్లు చెప్పారు.

ధాన్యం మిల్లుల తనిఖీ

మండలంలోని కొడాలి, తాడేపల్లి, చిట్టూర్పు గ్రామాల్లో ధాన్యం మిల్లులను తనఖీ చేశారు. ఆయా మిల్లర్ల యజమానులతో మాట్లాడి నాణ్యమైన గోనె సంచులు రైతులకు సరఫరా చేయాలని, బ్యాంకు గ్యారెంటీలు (బీజీ) సకాలంలో చెల్లించాలని మిల్లరకు సూచించారు. కార్యక్రమాల్లో పీడీఎస్ డీటీ కొడాలి శ్రీనివాసరావు, మండల ఇన్‌చార్జి ఏవో డి.అనూష, ఆర్ఐ కె.శ్రీనివాస్, వీఆర్వోలు, వీఏఏలు, మిల్లర్లు, పీఏసీఎస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సుకన్యాపాల్‌కు బెస్ట్ టీచర్ అవార్డు



ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు విజయరాజు నుంచి అవార్డు అందుకున్న సుకన్యాపాల్

నాగాయలంక: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) మహిళావిభాగం అవనిగడ్డ నియోజకవర్గం అధ్యక్షురాలు పాస్టర్ సాలి సుకన్యాపాల్ (నాగాయలంక) బెస్ట్ వి.బి.ఎస్ (వెకేషన్ బైబిల్ స్కూలు)టీచర్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం రాత్రి ఏఐసీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల వేడుకలో సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.విజయరాజు చేతులమీదుగా ఆవార్డును స్వీకరించినట్లు ఆమె బుధవారం తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గంలో సంస్థ నాయకురాలు, సేవకురాలిగా విశిష్టసేవలు అందిస్తున్నందుకు ఈఅవార్డును సంస్థ ప్రకటించింది. మండలంలోని టీ.కొత్తపాలెం శివారు దేగలవారిపాలెంలో నెహెమ్యా మినిస్ట్రీస్ నిర్వహిస్తున్నారు. ఇదే వేడుకలో నాగాయలంకకు చెందిన బైబిల్ మ్యూజిక్ టీచర్ కె.సుధీష్ణ బెస్ట్ సింగర్ అవార్డు అందుకున్నారు.

ఘనంగా అడవి బాపిరాజు జయంతి



అడవి బాపిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపురాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపిరాజు చిత్రపటానికి డెప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, సిబ్బంది పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, కవిగా, నాటక రచయితగా, కళాకారునిగా, పాత్రికేయునిగా బాపురాజు అందించిన సేవలు అభినందనీయమన్నారు.

భీమవరంలో జన్మించిన ఆయన రాసిన పలు నవలలు, నాటకాలు సినిమాలు అత్యంత ప్రజాధరణ పొందాయన్నారు. నారాయణరావు, గోన గన్నారెడ్డి, తుఫాన్, కోనంగి వంటి నవలలు, బావ బావ పన్నీరు వంటి పాటలు ప్రజాదరణ పొందాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవలు ప్రారంభం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఘంటసాలపాలెం(ఘంటసాల): మండలంలోని ఘంటసాలపాలెంలో గ్రామంలో గుంటూరు లాం సామాజిక విజ్ఞాన కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను విద్యార్థినులు సత్ఫలితాలతో ముగించాలని కోరారు. స్వచ్ఛతపై రైతులు, విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ వై.బిందు, పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు, డాక్టర్ కె.ధనశ్రీ, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం రాజశేఖర్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్, డాక్టర్ రేవతి, విద్యార్థినులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

అవనిగడ్డ: స్థానిక ఏడో వార్డులో బుధవారం హనుమత్ సీతా లక్ష్మణ సమేత కోదండరామ స్వామి, భూదేవి శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల నూతన ఆలయ ప్రతిష్ఠామహోత్సవాలు వైభవంగా జరిగాయి. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ పెద్దలు, వేద పండితులు వారిని సత్కరించారు.